తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
గురువారం 15 అక్టోబర్ 2026
పేజీలు : 8



# రామన్నగూడెంలో భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలి

## కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్14 ( జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని, అశ్వారావుపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టర్ అశ్వారావుపేట మండలం రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో భూ రీ సర్వే పనులను, పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, సర్వే నంబర్లు, గ్రామ సరిహద్దులు, రెవెన్యూ భూములు, అటవీ భూములకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో భూ రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని, సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో గ్రామ సరిహద్దులను నిర్ధారించే ప్రక్రియ చేపడుతున్నామని సర్వేయర్లు వివరించారు. గత వారం గ్రామసభ నిర్వహించి గ్రామ సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన పనులు ప్రారంభించినట్లు తెలిపారు.సర్వే నంబర్ 39 పరిధిలో భూములను సాగు చేసుకుంటున్న రైతులతో కలెక్టర్ మాట్లాడి, వారు ఎప్పటి నుంచి భూములను సాగు చేస్తున్నారు, వారి వద్ద పాత పట్టాలు, పాస్‌బుక్‌లు ఉన్నాయా, వాటిని ఎప్పుడు జారీ చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ఉన్న పాత పట్టాలు, పాస్‌బుక్‌లు, ఇతర భూ సంబంధిత పత్రాలను పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. మూడు సర్వే నంబర్ల పరిధిలో 181 మంది రైతులు ఉన్నట్లు అధికారులు వివరించగా, వారికి సంబంధించిన పట్టాలు, రైతుబంధు వివరాలు, భూముల సాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూముల విస్తీర్ణం, గ్రామ సరిహద్దులు, అటవీ బ్లాక్‌ల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, పట్టాలు, గెజిట్ నోటిఫికేషన్లు, అందుబాటులో ఉన్న పాత భూ రికార్డులను సేకరించి ప్రస్తుత రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేసి, భూముల హద్దులు, విస్తీర్ణం, హక్కులకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో తహసీల్దార్ బి కిషోర్ తో పాటు సంబంధిత రెవెన్యూ, సర్వే, అటవీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ పట్టణంలో

# తీవ్ర కలకలం

### ఒడ్డుగూడెంలో వీధి కుక్కల బీభత్సం

### ఏడుగురిపై విచక్షణారహితంగా దాడి..

### తీవ్ర గాయాలతో ఆందోళనలో స్థానికులు

**కొత్తగూడెం క్రైమ్ ,అక్టోబర్ 14, (జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం ప్రాంతంలో వీధి కుక్కలు రెచ్చిపోయాయి. ఈ ప్రాంతంలో సంచరిస్తున్న పిచ్చి కుక్కలు ఒక్కసారిగా స్థానికులపై బుధవారం విరుచుకుపడ్డాయి. ఈ వరుస దాడిలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

అకస్మాత్తుగా కుక్కలు దాడి చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిపై, ఇళ్ల ముందు ఉన్న వారిపై కుక్కలు సామూహికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. కుక్కల దాడిలో గాయపడిన బాధితుల్లో ఒకరి చేతికి, శరీరంపై తీవ్ర గాయాలైన దృశ్యాలు స్థానికంగా భయాందోళనలను రేకెత్తించాయి.

?పాల్వంచ పట్టణంలో రోజురోజుకూ వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోతోందని, చిన్న పిల్లలు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, వీధి కుక్కల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు ప్రభుత్వపరంగా సాయం అందించాలని కోరుతున్నారు.





# ఆర్టీఐ అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా సూర్యాపేట

### ఈ గుర్తింపుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ నరసింహ

**సూర్యాపేట (జనంసాక్షి):** సమాచార హక్కు చట్టం అమలులో సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాగా ఇటీవల హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేతులమీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద్ లాల్ పవార్ ను జిల్లా ఎస్పీ కె.నరసింహ



బుధవారం కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో జిల్లా యంత్రాంగం కనబరిచిన పనితీరుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం అభినందనీయమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ నాయకత్వంలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడం, ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకతను పెంపొందించడం, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలనలో జిల్లా యంత్రాంగం మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# దసరా వేళ సర్పంచ్ ఔదార్యం.. పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాల కానుక!

### ‘అందరూ బాగుండాలి.. అందరితో నేను ఉండాలి’ అనే నినాదంతో సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి ఆత్మీయత



**గుడిపల్లి,అక్టోబర్ 14 (జనంసాక్షి):** దసరా పండుగ వేళ గ్రామపంచాయతీ పాలకవర్గం, సిబ్బందికి నూతన వస్త్రాలను కానుకగా అందజేసి నల్లగొండ జిల్లా గుడిపల్లి మండల కేంద్రం సర్పంచ్ కూన్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పండుగ అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలనే సంకల్పంతో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా నూతన వస్త్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కూన్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. “అందరూ బాగుండాలి.. అందరితో నేను ఉండాలి” అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.పండుగలు అందరిలో ఐక్యతను,సోదరభావాన్ని పెంపొందిస్తాయని, ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కానుకలను అందించినట్లు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు,పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గుడిపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ్ రెడ్డి,ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య,వార్డు సభ్యులు ఎర్ర మహేశ్వరి,కత్తుల రమేష్,గోలి స్వామి,దారం సైదమ్మ, బోడ నాగరాజు,ఎర్ర వంశీకృష్ణ,గణపురం రాధిక,వట్టేపు శ్రీను,వడ్లపల్లి శ్రావణ్య, గ్రామపంచాయతీ సిబ్బంది గోలి ఈశ్వర్,వడ్లపల్లి వెంకట్ రెడ్డి,భూతం యాదయ్య,కొమ్ము దుర్గయ్య, ఎర్ర వెంకటయ్య,బోడ వెంకటయ్య గణపురం ముత్యాలు పాల్గొన్నారు.

# పగిడిమర్రి మాజీ ఎంపీటీసీ యశోదమ్మ మృతి

## యశోదమ్మ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సంతాపం



కనగల్లు, అక్టోబర్ 14 (జనంసాక్షి) మండలంలోని పగిడిమర్రి మాజీ ఎంపీటీసీ ఎర్ర మాద యశోదమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. 2019 నుండి 2024 మధ్యకాలంలో పగి డిమర్రి గ్రామ ఎంపీటీసీగా యశోదమ్మ (బి ఆర్ఎస్) పదవి బాధ్యతలను నిర్వహించి గ్రామ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కార దిశవైపు పనిచేసిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆమె సేవలను కొనియాడారు. ఆమె మృతి పట్ల కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, సిపిఐ, రైతు సంఘాల నాయకులు సంతాపాన్ని ప్రకటించి ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక సర్పంచ్ నాగబెల్లి నాగమణి సైదులు, మాజీ ఎంపీపీ లు కరీం పాష కోయగూర అంజిరెడ్డి మాజీ జెడ్పిటిసిలు ఎర్రోళ్ల సంజీవ, చిట్ల వెంకటేశం, జి ఎడవెల్లి సొసైటీ చైర్మన్ డి శ్రీనివాస్ టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అయితగోని యాదయ్య గౌడ్ మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్ రెడ్డి, సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, రేగట్టే మాజీ సర్పంచ్ కదారి కృష్ణయ్య టిఆర్ఎస్ నాయకులు బోయపల్లి జానయ్య గౌడ్, జెరిపే శ్రీను, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్కే లతీఫ్, పెరిక యాదయ్య, దేప వెంకటరెడ్డి రావుల శ్రీనివాస్ రెడ్డి, బదుపుల శంకర్, రాజపేట మల్లేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై గ్రామ పంచాయతీల పేర్లు నమోదు చేయాలి

## చౌటుప్పల్ మండల సర్పంచుల వినతి



చౌటుప్పల్ అక్టోబర్ 14 (జనంసాక్షి) మండలంలో పంపిణీ చేస్తున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డులపై రెవెన్యూ విలేజ్ పేర్లతో పాటు ఆయా గ్రామ పంచాయతీల పేర్లను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని చౌటుప్పల్ మండల సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, చౌటుప్పల్ ఆర్డీఓ వి. శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ తహసీల్దార్ వీరాభాయ్ లను సర్పంచుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జాయింట్ సెక్రెటరీ,అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 12 పంచాయతీలు మాత్రమే రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయని తెలిపారు. మిగిలిన 14 గ్రామ పంచాయతీల పేర్లు లేకుండా, కేవలం రెవెన్యూ విలేజ్ పేర్లతోనే స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల స్థానిక ప్రజలు ఇబ్బంది పడతారని, కాబట్టి తక్షణమే ఆయా గ్రామ పంచాయతీల పేర్లను కూడా కార్డులపై ముద్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్డులపై పేర్లు లేని ఆ 14 గ్రామ పంచాయతీలు ఇవే అంకిరెడ్డిగూడెం,గుండ్లబావి, ఆరెగూడెం, కాట్రేవ్, చింతలగూడెం, దామెర, ధర్మోజిగూడెం, యానగంటితండా, పెద్ద కొండూరు, మసీదుగూడెం, మందుల్లోగూడెం, కుంట్లగూడెం,ఎల్లంబావి, కొయ్యలగూడెం. సర్పంచుల వినతిపై కలెక్టర్, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని పరిశీలించి, త్వరలోనే స్మార్ట్ రేషన్ కార్డులపై గ్రామ పంచాయతీల పేర్లు వచ్చేలా సంబంధిత పై అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గిర్కంటి నిరంజన్ గౌడ్, కైరంకొండ స్వప్న అశోక్, నందగిరి వెంకటేశం గౌడ్, తంగేళ్ల వెంకటేశం, గంజి వనజ కృష్ణ,వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

# యోగా శిబిరం ప్రారంభం



చిట్యాల , అక్టోబర్ 14 ( జనం సాక్షి ): నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ కుమార్ రెడ్డి సహకారంతో వారం రోజులపాటు నిర్వహించే సుదర్శన క్రియ యోగా, ధ్యాన కార్యక్రమాలు బుధవారం గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు గ్రామస్థులు, యువకులు, భవానీ మాలధారులకు యోగా, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాల్లో శిక్షణ ఇచ్చారు. సుదర్శన క్రియ సాధనతో ఒత్తిడిని తగ్గించుకొని మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. ఈ సందర్భంగా గుత్తా అమిత్ కుమార్ రెడ్డి యువత ఒత్తిడి, ఆందోళనలకు దూరంగా ఉంటూ యోగా, ధ్యానం అలవర్చుకోవాలని, సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ట్రస్ట్ చైర్మన్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ సత్యనారాయణ, పల్లపు ప్రశాంత్, ఆవుల రమేష్ యాదవ్ తదితరులు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

సూర్యాపేట (జనంసాక్షి): అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, సూర్యాపేట మున్సిపాలిటీ 22వ వార్డు ఎమ్మెల్సీ ఎన్నికల పార్టీ ఇన్చార్జ్ మోత్కూరి సందీప్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 22వ వార్డులో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచనల మేరకు ఆ వార్డులో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొని మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. పట్టభద్రులకు అవసరమైన సమాచారం, నమోదు ప్రక్రియకు సంబంధించిన సహకారంను తమ పార్టీ తరుపున అందిస్తామని తెలిపారు. ఓటర్ నమోదుకు సంబంధించి సందేహాలు ఉన్న వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకొని వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



# మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన సంతోషిమాత

సూర్యాపేట (జనంసాక్షి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో అమ్మవారు శ్రీమహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణశర్మ చండీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమం,రుద్రహోమం నిర్వహించారు. శ్రీచండీమాత అలంకార భక్తులకు సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమం చేశారు. అమ్మవారి సన్నిధిలో గల శ్రీచక్ర యంత్రానికి ప్రత్యేక పూజలు, బ్రాహ్మణ ముత్తైదువకు సుహాసిని పూజ, శివలింగాకృతిలో దీపోత్సవం నిర్వహించారు. మహిళలు సామూహికంగా సౌందర్యలహరి శివానందలహరి పఠించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, కన్వీనర్ నరేంద్రుని విద్యాసాగర్ రావు, ఉపాధ్యక్షులు బెలిదే అశోక్, ఉత్సవ నిర్వాహకులు గోపారపు రాజు, సహాయ కార్యదర్శి దేవరశెట్టి సోమయ్య, సభ్యులు బ్రాహ్మణపల్లి మనోహర్ గుప్త, మహంకాళి ఉపేందర్ ,కక్కిరేణి పద్మ, తెడ్ల పల్లవి అలంకరణ భక్తులు కక్కిరేణి మురళీకృష్ణ , ప్రొద్దుటూరి నాగప్రసాద్, అర్చకులు అశోక్ మిశ్రా, రాఘవాచార్యులు దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల విద్యుత్ అందించాలి

## వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతు ధర్నా



చిట్యాల, అక్టోబర్ 14 ( జనంసాక్షి): రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు గతంలో ఉన్న పరిస్థితు లను తిరిగి తీసుకొస్తామని చెప్పారని, ప్రస్తుతం రైతులకు సక్రమంగా విద్యుత్, సాగునీరు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వంటి విద్యుత్ ఉత్పత్తి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతుల మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌తో పాటు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు..

# ఎమ్మెల్సీగా గుజ్జ సత్యంకు అవకాశం ఇవ్వాలి:పద్మశాలి మహాజన సంఘం తీర్మానం



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 (జనం సాక్షి): బీసీ హక్కుల సాధనతో పాటు విద్యా, వైద్య, సామాజిక సేవలు, చేనేత రంగాల్లో గుజ్జ సత్యనారాయణ అందిస్తున్న సేవలను గుర్తించి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని భూదాన్ పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం తీర్మానం చేసింది. ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు మాట్లాడుతూ బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కృషి చేస్తున్న గుజ్జ సత్యం సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గుజ్జ సత్యంకు ఎమ్మెల్సీ పదవి కల్పించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గుజ్జ సత్యం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా, టీజీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, కులగణనలో న్యాయం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి బ్యాంకు మాజీ చైర్మన్ చిట్టిపోలు శ్రీనివాస్, పద్మశాలి చేనేత సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, మహాజన సంఘం ఉపాధ్యక్షుడు భోగ నరసింహ, ప్రధాన కార్యదర్శి భరత బాలరత్నం, సహాయ కార్యదర్శి కడవేరు చంద్రమౌళి, కోశాధికారి సంఘం చంద్రయ్య, సభ్యులు గంజి అంజయ్య, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, గౌరవ సలహాదారు తడక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# 108 చీరలతో కనకదుర్గమ్మ కు విశేష అలంకరణ

## మహా చండీదేవిగా అమ్మవారి దర్శనం మహిళల కుంకుమ పూజలు

**చిట్యాల, అక్టోబర్ 14 ( జనం సాక్షి):** చిట్యాల పట్టణంలోని శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుచున్నాయి. నాలుగవ రోజు బుధవారం అమ్మవారు శ్రీ మహాచండీ దేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. 108 రకముల చీరలతో అమ్మవారికి అలంకరణ జరిపారు. అల్లం గారెలు, పర మాన్నం అమ్మవారికి ప్రసాదాన్ని నివేదించారు. 108 చీరల దాత దుబ్బాక మహేందర్ రెడ్డి మాధవి దంపతులకు ఈ సందర్భంగా ఆలయ కమిటీ అభినందనలు తెలిపింది. మహిళలు కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ నేతృత్వంలో దౌలతాబాద్ వాసుదేవ శర్మ అర్చకత్వంలో పూజాదికాలు జరిగాయి. డైరెక్టర్లు గంజి వెంక టేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, బెలిదె సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయ్యన్న, కుమ్మరి దేవి రవి, ఆలయ అధికారి ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శు క్రవారం సామూహిక కుంకుమార్చన, బాల బాలికలచే సరస్వతి పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. మహిళలు చిన్నారు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అమ్మవారిని దర్శించుకున్న నేతలు బుధవారం కనకదుర్గ అమ్మవారిని చిట్యాల మున్సిపల్ ఛైర్ పర్సన్ పందిరి గీత రమేష్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ పందిరి శ్రీనివాసులు, చిట్యాల రైస్ మిల్లర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు తేరటుపల్లి హనుమంతు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు తో పాటు స్థానిక హెచ్.పీ గ్యాస్ డీలర్ గోవర్ధన్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



# కాలిపోయిన పూరి గుడిసె

## - ఇందిరమ్మ ఇంటి కోసం వేడుకోలు

**మునగాల, అక్టోబర్ 14(జనంసాక్షి):** మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన గద్దం కోటిలింగం అనే నిరుపేదకుటుంబానికి చెందిన వ్యక్తి పూరిగుడిసె 2017లో కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో కొంత మేర నగదు, కట్టుబట్టలు ఇంట్లోని సామాన్లు మొత్తం కాలి బూడిద అయ్యాయి. నాటి నుండి నేటి వరకు గద్దం కోటిలింగం, తన భార్య, కుమారుడు తాత్కాలికంగా మరొక పూరిగుడిసెను ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. బీదరికంలో ఉన్న కోటిలింగం ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోగా ప్రస్తుత ప్రభుత్వం గ్రామంలో ప్రకటించిన 19 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో కోటిలింగానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు. గత నెలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న కోటి లింగం కుటుంబానికి సైతం, ప్రస్తుత ప్రభుత్వం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోవడం పట్ల కోటిలింగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు పూరి గుడిసెలు కాలిపోయి, సర్వస్వం కోల్పోయిన తమ వైపు కన్నెత్తి కూడా చూడకుండా, భూములు ట్రాక్టర్లు ద్విచక్ర వాహనాలు కార్లు ఆస్తులు అంతస్తులు ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తున్నారని వారు ఆరోపించారు. తమ లాంటి నిరుపేద కుటుంబాలకు ఎంతోమందికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపేద కోటి లింగంకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.





## హైదరాబాద్ కు మహబూబాబాద్ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు పునరుద్ధరణ

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 14(జనంసాక్షి):** మహబూబాబాద్ నుంచి తుంగతుర్తి, అర్వపల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును తిరిగి పునరుద్ధరించారు. గత కొంతకాలంగా ఈ బస్సు నడుస్తుండగా ఇటీవల నార్కట్‌పల్లి వరకే కుదించారు. ఈ ప్రాంత ప్రయాణీకుల అభ్యర్థన మేరకు తిరిగి రెండు రోజుల నుంచి మళ్లీ యథావిధిగా హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు. ఈ బస్సు మహబూబాబాద్ డిపో నుంచి ఉదయం 5 గంటలకు బయలు దేరి మరిపెడబంగ్లా మీదుగా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి వెళ్లి తిరిగి తుంగతుర్తి నుంచి అర్వపల్లి కి ఉదయం 7 గంటలకు చేరుకొని ఇక్కడి నుంచి జాజిరెడ్డిగూడెం మూసీనది మీదుగా నకిరేకల్, నార్కట్‌పల్లి మీదుగా ఎల్‌బీనగర్‌కు 10.30 గంటలకు చేరుకుంటుంది. తిరిగి అక్కడ 11.30 గంటలకు బయలుదేరి అదే రూట్‌లో మళ్లీ మధ్యాహ్నం 2.30 గంటలకు అర్వపల్లికి వచ్చి ఇక్కడి నుంచి తుంగతుర్తి, మరిపెడబంగ్లా మీదుగా మహబూబాబాద్ డిపోకు సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుందని ఆ డిపో మేనేజర్ కళ్యాణి తెలిపారు. ?ఈ ప్రాంత ప్రజలు బస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






## చిలుకూరు పీహెచ్‌సీలో

# వైభవంగా బతుకమ్మ సంబరాలు..

**చిలుకూరు, అక్టోబర్ 14(జనంసాక్షి):** చిలుకూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, మహిళా హెల్త్ వర్కర్ల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. పీహెచ్‌సీ ఆవరణలో గునుగు, తంగేడు, జిల్లేడు, బంతి, చామంతి వంటి వివిధ రకాల సహజసిద్ధమైన పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి సాంప్రదాయ దుస్తులలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడి సందడి చేశారు. వైద్య సేవలతో నిరంతరం బిజీగా ఉండే పీహెచ్‌సీ సిబ్బంది అంతా కలిసికట్టుగా ఈ పూల పండుగను జరుపుకోవడంతో ఆరోగ్య కేంద్ర ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. నిమ్మల సుభాష్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## స్వచ్ఛందంగా బతుకమ్మ విగ్రహానికి

# రంగులు వేయించి ముస్తాబు

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** సద్దుల బతుకమ్మ వేడుకను పురస్కరించుకొని పర్సాయపల్లి గ్రామంలో చెరువు వెంట ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహానికి గ్రామ మత్స్య సహకార సంఘం ఛైర్మన్ అంకిరెడ్డి లింగయ్య తన సొంత ఖర్చులతో రంగులు వేయించి ముస్తాబు చేయించారు. ప్రతి ఏటా బతుకమ్మ ఉత్సవాలకు తానే స్వచ్ఛందంగా సొంత ఖర్చులతో రంగులు వేయించి ముస్తాబు చేయించడం జరుగుతుందని దాత లింగయ్య తెలిపారు.

## మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు

**చిలుకూరు, అక్టోబర్ 14(జనంసాక్షి):** చిలుకూరు మండలంలో రహదారుల అభివృద్ధికి రూ.40.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా రామాపురం గ్రామంలోని జాతీయ రహదారిపై మండల కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సూర్యాపేట జిల్లాలో నాలుగు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.52.50 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయగా, చిలుకూరు మండలంలోని రెండు రహదారులకు రూ.40.50 కోట్లు కేటాయించారు. పాత జాతీయ రహదారి?9 నుంచి కొండాపురం వరకు 12.2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, పటిష్టీకరణ పనులకు రూ.27 కోట్లు, బేతవోలు నుంచి ఆచార్యులగూడెం వరకు 5.6 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.13.50 కోట్లు మంజూరు య్యాయి. రామాపురం గ్రామ రహదారి సమస్యను మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ వంగవీటి రామారావు, కోదాడ పట్టణ అధ్యక్షులు వంటిపులి వెంకటేష్, చిలుకూరు మండల అధ్యక్షులు కీతా.వెంకటేశ్వరరావు ,ప్రధాన కార్యదర్శి పిండ్రాతి. హనుమంతరావు ,జిల్లా నాయకులు రాయబారపు.వెంకటేశ్వర్లు, రామాపురం సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్, నర్సింహాపురం సర్పంచ్ సత్యనారాయణ, అల్లి మట్టయ్య, యూత్ అధ్యక్షులు విజయభాస్కర్, రామాపురం మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లబోతు సత్యనారాయణ, అల్లి వీరబాబు, అల్లి మల్లయ్య, కుక్కడపు శ్రీను, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి బాలలకు సరుకుల పంపిణీ

**చిలుకూరు, అక్టోబర్ 14(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అక్టోబర్ 10 నుండి అక్టోబర్ 21 వరకు (12 రోజులు) దసరా సెలవులను ప్రకటించడంతో మండల కేంద్రంలోని అంగన్వాడి 4 నందు బుధవారం పౌష్టిక ఆహారం బియ్యం, పప్పు, గుడ్లు నూనె, మురుకులను ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ సాధారణ రోజుల్లో అంగన్వాడీ కేంద్రాల్లో అందించే వేడి భోజనానికి బదులుగా, సెలవు రోజులకు సరిపడా పోషకాహారాన్ని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మరియు చిన్న పిల్లలకు తప్పక ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కవిత, లబ్ధిదారుల తల్లులు పాల్గొన్నారు.





కష్టమొస్తే పలకరించే మనిషి.. సమస్య ఎదురైతే అండగా నిలిచే నాయకుడు.. ప్రజలకు ఇబ్బంది కలిగితే తన పని అనుకుని ముందుకొచ్చే యువకుడు.. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్‌లో భూక్యా అశోక్ ప్రస్థానం ఇదీ. రాజకీయాల్లో పదవులు, హోదాలే గుర్తింపు అనుకునే రోజుల్లో.. పదవి లేకున్నా ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారు. వర్షాలకు రహదారులు దెబ్బతిన్నా.. కాలనీల్లో చెత్త పేరుకుపోయినా.. కష్టాల్లో ఉన్న కుటుంబానికి సాయం అవసరమైనా.. తనకు తోచిన రీతిలో స్పందిస్తున్నారు. విద్యార్థి దశలో మొదలైన సామాజిక స్పృహను రాజకీయ ప్రస్థానంలోనూ కొనసాగిస్తూ, ప్రజలతో మమేకమవుతున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మార్గదర్శకత్వం.. స్ఫూర్తితో ముందుకు సాగుతున్న అశోక్.. డివిజన్ సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని చెబుతున్నారు. ఖమ్మం (జనంసాక్షి)



# ప్రజాసేవలో యువకెరటం

Special జనంసాక్షి

## విద్యార్థి ఉద్యమ పాట నుంచి.. ప్రజల గుండెల్లోకి భూక్యా అశోక్

**ఉద్యమాల నుంచి ప్రజల మధ్యకు..**

విద్యార్థి దశలోనే తోటి విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ, హక్కుల కోసం పోరాడిన అనుభవం అశోక్‌కు ప్రజా సమస్యలపై అవగాహన పెంచింది. ఆ స్ఫూర్తితో 2014లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి పాత 8వ డివిజన్‌లోని గోపాలపురం, వైయస్సార్ కాలనీ, ఎల్బీనగర్ తదితర కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. తాగునీరు, మురుగునీటి కాలువలు, రహదారులు, వీధి దీపాలు.. ఇలా నిత్యం ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. వినతిపత్రం ఇచ్చి వదిలేయకుండా, సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులను సంప్రదిస్తున్నారు. ప్రజల మధ్య ఉండటమే నాయకత్వానికి అసలైన అర్థమని నమ్ముతూ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

**సమస్యొస్తే అండగా నిలుస్తూ..**

వర్షాకాలంలో 8వ డివిజన్‌లోని పలు ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడం, రహదారులపై బురద పేరుకుపోవడం, పిచ్చిచెట్లు పెరగడం, చెత్త పేరుకుపోవడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. పాలకవర్గం అందుబాటులో లేని సమయంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన అశోక్.. తన సొంత ఖర్చులతో జేసీబీలు, డోజర్లను ఏర్పాటు చేసి శుభ్రత పనులు చేపట్టారు. వైఎస్సార్ నగర్ కాలనీలో చెత్తను తొలగించి, నీరు సాఫీగా వెళ్లేందుకు మార్గాలు



ఏర్పాటు చేయించారు. రహదారులపై పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులను పర్యవేక్షించారు. దోమల నివారణకు మందుల పిచికారీ, వీధి దీపాల మరమ్మతుల కోసం అధికారులను సంప్రదించారు. సమస్యను చూసి వెళ్లిపోవడం కాదు.. పరిష్కారం దిశగా అడుగేయాలన్నదే తన ఆలోచనగా చెబుతున్నారు.

**ప్రతి గడపకూ పలకరింపు..**
**ప్రతి కష్టంలోనూ తోడు..**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'ప్రతి గడపకు - ప్రజా పలకరింపు' కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల కష్టసుఖాలను తెలుసుకుంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడిన పేద కుటుంబాలకు భోజన పొట్లాలు అందించారు. డివిజన్‌లో ఎవరైనా మరణించినప్పుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. కష్టాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. బతుకమ్మ, ముగ్గుల పోటీలు, తీజ్, క్రిస్మస్, రంజాన్ వేడుకల్లో పాల్గొంటూ మహిళలకు చీరలు, బహుమతులు అందిస్తున్నారు. కులమతాలకు అతీతంగా అందరితో కలిసిమెలిసి ఉండటానికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రజలతో అనుబంధం మాటల్లో కాదు.. అవసరమైనప్పుడు అందించే సాయంలో కనిపించాలన్నది ఆయన ఆలోచన.

- సమస్య ఏదైనా సరే.. నేనున్నానంటూ ముందడుగు
- కష్టాల్లో తోడుగా.. ప్రతి గడపకూ ఆప్యాయ పలకరింపు
- 8వ డివిజన్ అభివృద్ధే ఆశయం.. ప్రజల ఆశలే అశోక్‌కు బలం

### అవకాశం ఇస్తే ప్రజాసేవ చేస్తా : భూక్య అశోక్



రానున్న ఎన్నికల్లో 8వ డివిజన్‌కు ఎస్టీ రిజర్వేషన్ కేటాయిస్తే బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అశోక్ తెలిపారు. పువ్వాడ అజయ్‌కుమార్ ఆశీస్సులు, గొల్లపూడి రాంప్రసాద్, డివిజన్లోని మిగతా పెద్దల, ముఖ్య నాయకుల సహకారంతో ప్రజల మద్దతు కోరతానన్నారు. ప్రజలు ఆశీర్వదించి కార్పొరేటర్‌గా అవకాశం కల్పిస్తే.. డివిజన్‌కు శాశ్వత స్మశాన వాటికను తీసుకురావడమే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

**కాలుష్యంపై పోరు..స్మశాన వాటికే తొలి లక్ష్యం**



8వ డివిజన్‌ను దీర్ఘకాలంగా వేధిస్తున్న పవర్ ప్లాంట్ కాలుష్య సమస్యపై అశోక్ స్పందిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలిసి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందించారు. మరోవైపు, డివిజన్‌లో శాశ్వత స్మశాన వాటిక లేకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని గుర్తించారు. ఆఖరి మజిలీలోనూ ప్రజలు అవస్థలు పడాల్సి వస్తున్న పరిస్థితికి పరిష్కారం చూపాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, సమస్యల పరిష్కారం కోసం తనవంతు ప్రయత్నం చేస్తున్న భూక్యా అశోక్.. ప్రజాసేవే తన రాజకీయ ప్రస్థానానికి పునాది కావాలని కోరుకుంటున్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉండటమే తన బలమని భావిస్తూ ముందుకు సాగుతున్నారు.



# రాచకొండకు నీళ్లు వస్తేనే చౌటుప్పల్‌కు మహర్దశ

- శివన్నగూడెం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి
- వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలి
- ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్
- ఘనంగా రాచకొండ బతుకమ్మ ఉత్సవాలు



**చౌటుప్పల్, అక్టోబర్ 14 (జనం సాక్షి):** రాబోయే కాలంలో మునుగోడు నియోజకవర్గంలో అందరికంటే ఎక్కువగా చౌటుప్పల్ ప్రాంతమే ఫ్లోరోసిస్, కాలుష్య ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా 'రాచకొండ బతుకమ్మ ఉత్సవాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఇరగదిండ్ల భాస్కర్ మాట్లాడుతూ, చౌటుప్పల్‌లో ఇప్పటికే భూమిలోకి, గాల్లోకి విష రసాయనాలు వ్యాపిస్తున్నాయని, రానున్న రోజుల్లో ఇక్కడి భూముల పరిస్థితి వర్ణించలేని విధంగా మారబోతోందని హెచ్చరించారు. పండుగల వేళ కేవలం పాటలు పాడుకొని, బహుమతులు ఇచ్చి వెళ్లడం వల్ల బతుకులు మారవని, కుటుంబాల్లో నిజమైన సంతోషం ఉండదని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగాలు లేక, పంటలు పండిద్దామంటే నీళ్లు, విద్యుత్ లేక రైతాంగం అల్లాడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చౌటుప్పల్‌లో 850 అడుగుల లోతుకు బోర్లు వేస్తేగానీ నీళ్లు పడటం లేదని, రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ బాధలన్నీ తీరాలంటే శివన్నగూడెం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయి, అక్కడి నుండి రాచకొండకు, రాచకొండ ద్వారా చౌటుప్పల్‌కు కృష్ణా జలాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే, చౌటుప్పల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం దాదాపు పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడం దారుణమన్నారు. వచ్చే నెలలోగా ఈ ఆసుపత్రిని ప్రారంభించకపోతే, ప్రతి ఒక్కరూ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే సామాన్య ప్రజలకు హైదరాబాద్ వెళ్లే తిప్పలు తప్పుతాయని పేర్కొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. రాచకొండకు పూర్వవైభవం తెచ్చి, రాబోయే రోజుల్లో దేశమే గర్వించే స్థాయిలో ఇక్కడ దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని, మన నీటి హక్కు సాధించే వరకు పోరాటం ఆగదని భాస్కర్ స్పష్టం చేశారు.

## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

### కూనూరు సంజయ్ దాస్ గౌడ్ డిమాండ్



**చిట్యాల, అక్టోబర్ 14 ( జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిట్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురవక, సాగునీరు అందక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు కోసం పెట్టిన పెట్టుబడులతో పాటు పంటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. వర్షాభావంతో పంటలు ఎండిపోయిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు వడ్డీ మాఫీ చేయాలని, కరువు కారణంగా వలసలు పెరగకుండా ఉపాధి హామీ పథకం పనిదినాలను పెంచి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వేణుగోపాల్ రెడ్డి, నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి, భువనగిరి పార్లమెంట్ నాయకులు బత్తుల నాగరాజు గౌడ్, సి. హెచ్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

**కోదాడ, (జనంసాక్షి)** ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల పరిధిలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరుతూకోదాడ నియోజకవర్గ టిడిపి పార్టీ ఆధ్వర్యంలోఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు.నవంబర్ 6న ఓటరు నమోదు చేసుకోవడానికి చివరి తేదీ కావున, అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే తమ ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పార్టీ ప్రతినిధులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓరుగంటి ప్రభాకర్, సాతులూరి గురవయ్య, కట్టా సతీష్, సోంపేట బాలకృష్ణ కోదాడ రేవంత్ రెడ్డి, ఏటుకూరి సురేష్, రాయబారపు ఆశిష్ జువ్వాజి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచు పెళ్లికి ఏజేఆర్ ఫౌండేషన్ ఆర్థిక కానుక

**వలిగొండ, అక్టోబర్ 14 (జనం సాక్షి)** మండలంలోని పైల్వాన్‌పురం గ్రామానికి చెందిన బండారి పద్మ, మారయ్య దంపతుల కుమార్తె బండారి స్వాతి వివాహం సందర్భంగా ఏజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్నవారికి, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## మేళ్లచెరువులో లోకాయుక్త నిజనిర్ధారణ కమిటీ విచారణ

**మేళ్లచెరువు- మఠంపల్లి డొంకదారిని మైహోమ్ సిమెంట్ పరిశ్రమ కబ్జా చేసినట్లు ఆరోపణలు.**

**రెవెన్యూ,పంచాయతీరాజ్ అధికారులతో లోకాయుక్త ఫీల్డ్ ఎంక్వయిరీ..**



మేళ్లచెరువు జనం సాక్షి : మేళ్లచెరువు- మఠంపల్లి డొంకదారినీ మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ అక్రమంగా కబ్జా చేసినట్లు న్యాయవాది కమతం నాగార్జున చేసిన ఫిర్యాదు పై తెలంగాణ లోకాయుక్త విచారణ కమిటీ బుధవారం వాస్తవ పరిస్థితులపై విచారణ జరిపింది. మేళ్లచెరువు గ్రామపంచాయతీ డొంకదారిని కబ్జా చేసేందుకు, మేళ్లచెరువు గ్రామ పంచాయతీ అనుమతులు జారీ చేశారని, అనుమతులు జారీ చేసే ముందు డొంక దారికి ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మించనున్నట్లు మైహోం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం హామీ ఇచ్చినట్లు లోకాయుక్త లో దాఖలు చేసిన రిపోర్టులో పేర్కొన్నారు. దారినైతే కబ్జా చేశారుకానీ ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మించలేదంటూ న్యాయవాది నాగార్జున తెలంగాణ లోకాయుక్తను ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన లోకాయుక్త నిజనిర్ధారణ నిమిత్తం ప్రత్యామ్నాయ డొంకదారిని నిర్మించారా లేదా అనే వాస్తవ పరిస్థితి పై రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా నిజనిర్ధారణ కమిటీని లోకాయుక్త ఆదేశించినట్లు నిజ నిర్ధారణ కమిటీ అధికారి కోటేశ్వర్ తెలిపారు. విచారణలో భాగంగా మేళ్లచెరువు తాసిల్దార్ పంచాయతీరాజ్ అధికారులు, సర్వే టీం పాటు ఫిర్యాదారుడు కమతం నాగార్జున సమక్షంలో ఫీల్డ్ ఎంక్వయిరీ నిర్వహించారు. మేళ్లచెరువు? మఠంపల్లి డొంకదారి మైహోం సిమెంట్ పరిశ్రమ మధ్యలో గుండా 1.5 కిలోమీటర్లు ఉన్నట్లు సర్వే అధికారులు లోకాయుక్త విచారణ అధికారి ముందు పేర్కొన్నారు. డొంకదారి కబ్జాకి గురైన మాట వాస్తవామేనని, ప్రత్యామ్నాయ రోడ్డు మైహోమ్ సిమెంట్ సంస్థ కల్పించలేదని, కల్పించినట్లు ఎటువంటి డాక్యుమెంట్స్ గ్రామపంచాయతీ లేవని పంచాయతీ కార్యదర్శి ఫరీద్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఇదే విషయంపై పూర్తి లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని మేళ్లచెరువు తహసిల్దార్, ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీలకు నోటీసులు జారీ చేశారు నేటి విచారణ రిపోర్టును లోకాయుక్త లో దాఖలు చేయనున్నట్లు విచారణ అధికారి కోటేశ్వర్ తెలిపారు. విచారణ సమయంలో డొంకదారి కబ్జాపై రైతులు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించారు. రైతుల స్టేట్మెంట్ రికార్డ్ చేశారు.

**మైహోమ్ సిమెంట్స్ యాజమాన్యంపై రైతుల ఆగ్రహం**

ఫిర్యాదుదారుడు కమతం నాగార్జున ప్రభుత్వ అధికారుల మధ్య విచారణ జరుగుతుండగా మైహోమ్ సిమెంట్స్ యాజమాన్యం విచారణ స్థలానికి వచ్చి మాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విచారణ ఎలా జరుపుతారని, వీళ్లు రైతులు కాదని రైతుల పట్ల చిన్నచూపుగా మాట్లాడడంతో అక్కడ ఉన్న రైతులు ఒకసారిగా మైహోమ్ సిమెంట్ సంబంధించిన ఉద్యోగులపై ఆగ్రహానికి గురయ్యారు. మైహోమ్ సిమెంట్ యాజమాన్యం రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీస్ అధికారులు నచ్చజెప్పడంతో రైతులు, విలేకర్లు శాంతించారు. కార్యక్రమంలో మేళ్లచెరువు తాసిల్దార్ సుధారాణి, ఎస్సై నవీన్ కుమార్, మండల సర్వేయర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఫరీద్, జిపిఓ రవి, రైతులు పోలీసులు పాల్గొన్నారు.

# గురువుకు వందనం

## ఉప్పు నాగయ్య కు జీ న్యూస్ తెలుగు 2026 అవార్డు



**నూతనకల్ అక్టోబర్ 14( జనంసాక్షి)**
జీ న్యూస్– తెలుగు వారి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ఎడ్యుకేషన్ కాంక్లవే టీచర్స్ అవార్డ్స్ -2026 ప్రదానోత్సవం లో భాగంగా తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వేదిక గా గురువందనం – 2026 పేరిట జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, ఎంపీ ఈటెల రాజేందర్, టీచర్ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి, కేశవరావు, హరీష్ రావు, పి ఆర్ టి యు టి ఎస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి సమక్షంలో జీ న్యూస్ తెలుగు 2026 అవార్డు ను నూతనకల్ మండలం అలుగునూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య తీసుకోవడం జరిగింది. ముఖ్య అతిథి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ. దేశ భవిష్యత్తుకు పునాదులు తరగతి గది నుండే పడతాయని, సమర్థవంతమైన బోధన ద్వారా తమ విద్యార్థుల్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులను సన్మానించుకోవడం గర్వంగా ఉందని, నాగయ్య తను పనిచేసిన వివిధ పాఠశాలలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో విద్యార్థి సమగ్రాభివృద్ధికి కృషి చేసినందుకుగాను జిల్లా నుండి ఈ అవార్డు లభించడం విశేషమని కొనియాడారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నాగయ్య హృదయపూర్వక ధన్యవాదములు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు.



# మహాచండీ దేవిగా దుర్గామాత అలంకరణ

**జాజిరెడ్డిగూడెం మండల(జనంసాక్షి):**
దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారు శ్రీ మహాచండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కొమ్మాల గ్రామంలో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ?కొమ్మాలలోని వేణుగోపాలస్వామి ఆలయం పక్కన ప్రతిష్టించిన దుర్గాదేవి విగ్రహం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలోని మరో వీధిలో ప్రతిష్టించిన దుర్గాదేవి విగ్రహం వద్ద భక్తులు, మాలధారులు విశేష పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# వైభవంగా కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 (జనం సాక్షి):**
పట్టణంలోని పెద్ద చెరువు వద్దగల శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. బలిప్రదానం, బలిహరణం, పూర్ణాహుతి, మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మెరుగు మల్లయ్య యాదవ్ ధర్మపత్ని అంతమ్మ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముప్పిడి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఇబ్రహీంపట్నం అంజయ్య, గుణగారి దినేష్ రెడ్డి, పోతగల్లు దానయ్య, కొమ్ము లక్ష్మణ్, గౌరవ సలహాదారులు బొక్క బాల్ రెడ్డి, కోయ్యడ నరసింహా, గునిగంటి మల్లేష్, చేరాల నరసింహా, ఉపాధ్యక్షులు మెరుగు బాలకృష్ణ యాదవ్, కేసారం బాల్ రెడ్డి, నల్ల నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి దొడ్డమోని దినేష్ యాదవ్, సహాయ కార్యదర్శులు సంకు నరసింహ, గోర్కంటి బాలయ్య, దొడ్డమోని ప్రభాకర్, కోశాధికారి మోటే మహేష్, వంగూరి సైదులు, కొమ్ము చంద్రయ్య, సాంస్కృతిక కార్యదర్శి సొల్లు శంకరయ్య, సహాయ సాంస్కృతిక కార్యదర్శి సైదులు సత్యనారాయణ, మెరుగు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలి

## -శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**గుడిపల్లి,అక్టోబర్ 14 (జనంసాక్షి):**
ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహాన్ని పొందాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు. బుధవారం గుడిపల్లి మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన దుర్గామాతను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. శరన్నవరాత్రి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలు దేశంలో ఎక్కడ ఉన్నా తమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ పండుగల ద్వారా సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలని అన్నారు.
అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.
ఈ కార్యక్రమంలో గుడిపల్లి సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ అర్వపల్లి సరిత నర్సింహా,బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్ర యాదగిరి, బొడ్డుపల్లి మహేందర్, రమావత్ శ్రీను నాయక్, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రానికి నిధులు మంజూరు చేయండి

## స్థానికులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేత



**నూతనకల్ అక్టోబర్ 14 ( జనంసాక్షి)**
నూతనకల్ మండల కేంద్రం అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని నూతనకల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు హైదరాబాద్ లో ఎమ్మెల్యే మందుల సామేల్ నివాసంలో వారిని కలిసి నూతనకల్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా సూర్యాపేట దంతాల పల్లి ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని, నూతనకల్ సెంటర్ లో బస్టాండ్ నిర్మించి ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల ను ఏర్పాటు చేయాలి, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లను, తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలి. మండల కేంద్రం తో పాటు మండలంలోని గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పై అభివృద్ధి పనులను మంజూరు చేసి మా గ్రామ అభివృద్ధికి సహకరించగలరని ఎమ్మెల్యేని వినయ పూర్వకంగా కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, పూజల సైదులు, జటంగి గణేష్ యాదవ్, బండపెల్లి చంద్రు, మహేష్ సతీష్ మధు కళ్యాణ్ రవి సంతోష్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడు.. మృతదేహం లభ్యం



**వలిగొండ,అక్టోబర్ (జనం సాక్షి )**
మండలంలోని కేర్చిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం… పైల్వాన్‌పురం గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య (70)గా మృతుడిని గుర్తించారు.
ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన పెంటయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వలిగొండ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అక్టోబర్ 14న కేర్చిపల్లి శివారులోని బండారి జంగయ్య వ్యవసాయ భూమిలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడి చిన్న కుమారుడు దుబ్బ భాస్కర్ మృతదేహాన్ని తన తండ్రిగా గుర్తించారు. పోలీసులు కేసును బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద మార్చి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, వాటిని నిర్ధారించేందుకు పోస్టుమార్టం నిర్వహించారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్యాపేట(జనంసాక్షి) :**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా నీటిపారుదల శాఖ సీఈ నాగభూషణరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సీఈ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ సంబరాలని అన్నారు. బతుకునిచ్చే అమ్మ బతుకమ్మ అని కొనియాడారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తెలంగాణ ఆడపడుచులు అందరూ చిన్న పెద్ద అనే తేడా లేకుండా సంతోషంగా జరుపుకునే పెద్ద పండుగ బతుకమ్మ అని అన్నారు. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో బతుకమ్మ పాటలు పాడుతూ అధికారులు, సిబ్బంది ఆడారు. ఈ కార్యక్రమంలో టీజీఓ సంఘ కార్యదర్శి భూక్యా పాండు నాయక్, ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈలు సత్యనారాయణ, రామ్ కిషోర్,జీవీ వెంకటేశ్వర్లు, యాదగిరి,మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ ధరావత్ స్వప్న, జాయింట్ సెక్రటరీ మల్సూర్, డీఈలు, ఏఈలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు

### అప్‌డేట్ క్యాంపుల జిల్లా విద్యాశాఖాధికారిణి వాసంతి

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ - 14 ( జనంసాక్షి )** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, సాధారణ ప్రజల సౌకర్యార్థం ఈ దసరా సెలవుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి డి. వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విద్యాధికారిణి తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపులలో నూతన ఆధార్ నమోదుతో పాటు, విద్యార్థులకు అత్యంత కీలకమైన పెండింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్లు, సాధారణ ప్రజలకు అవసరమైన ఇతర ఆధార్ సేవలు అందించబడతాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ, పెండింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సమాచారాన్ని చేరవేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారిణి ఆదేశించారు. ఆధార్ సేవల కొరకు యుఐడిఏఐ నిర్ణయించిన ప్రామాణిక నిబంధనల ప్రకారమే రుసుములు వసూలు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి హెచ్చరించారు. జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, సాధారణ ప్రజలందరూ తమ సమీపంలోని మండల వనరుల కేంద్రం లేదా కేటాయించిన జూనియర్ కళాశాలల్లో సంప్రదించి ఈ దసరా సెలవుల్లో ఆధార్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### ప్రియదర్శిని మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 14:(జనంసాక్షి)** స్థానిక ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ వస్త్రధారణలో పాటలు పాడుతూ, కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. బతుకమ్మలకు పూజలు నిర్వహించి, అనంతరం బతుకమ్మలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ మహిళల ఐక్యతను చాటిచెప్పే ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. విద్యార్థినులు ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల గోపాల్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ మాట్లాడుతూ.. పండుగలు భావితరాలకు సాంస్కృతిక వారసత్వాన్ని అందించే వారధులని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

### కల్లూరు రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై

# రైతులకు శిక్షణ కార్యక్రమం



**కల్లూరు అక్టోబర్ 14(జనం సాక్షి)**
కల్లూరు పట్టణంలోని రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఫణి శ్రీ మండల వ్యవసాయ అధికారి మాదా భత్తుల రూప పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఫణి శ్రీ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, రసాయన ఎరువులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గిం చడం, జీవ ఎరువుల వినియోగం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టాలని, పంటల్లో సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలని, రసాయన ఎరువులు పురుగుమందులను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ స్థిరమైన వ్యవసాయ పద్ధతుల వైపు అడుగులు వేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించారు.

# నాలుగు బంగారు పతకాలతో సారపాక కీర్తి పతాకం

### మేఘన కాంతి ప్రియ తల్లిదండ్రులకు బీజేపీ నాయకుల ఘన సన్మానం



**బూర్గంపహాడ్ అక్టోబర్ 14 (జనంసాక్షి)**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ విద్యను విజయవంతంగా పూర్తి చేసి నాలుగు బంగారు పతకాలు సాధించిన సారపాకకు చెందిన మేఘన కాంతి ప్రియ ఘనతను పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాకకు చెందిన తాటి రెడ్డి గోవిందరెడ్డి, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మేఘన సాధించిన ఈ విజయం మండల ప్రజల్లో ఆనందాన్ని నింపింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన మేఘన, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, యూనివర్సిటీ ఉపకులపతి జె. అనురాధ చేతుల మీదుగా నాలుగు బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆమె తల్లిదండ్రులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మేఘన నాలుగు బంగారు పతకాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. సారపాక, మోరంపల్లి బంజరతో పాటు బూర్గంపాడు మండలానికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, రాష్ట్రానికి ఆమె మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. మేఘనను సరస్వతీ పుత్రికగా అభివర్ణిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మేఘన తండ్రి గోవిందరెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచేదని తెలిపారు. ఆమెను ఉన్నత స్థాయిలో చూడాలనే లక్ష్యంతో సివిల్ సర్వీసెస్ సాధించి ప్రజలకు సేవ చేయాలని ప్రోత్సహించినట్లు చెప్పారు. అదే లక్ష్యంతో ముందుకు సాగుతూ కుమార్తె సాధిస్తున్న విజయాలు తమ కుటుంబానికి ఎంతో సంతృప్తిని, గర్వాన్ని కలిగిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు బి. సాయిశ్రీను, మండల ఇన్‌చార్జి ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలు నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు దివ్యశ్రీ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రహీం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చుక్కపల్లి బాలాజీ, కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, దుప్పటి సురేష్, మండల ప్రధాన కార్యదర్శులు, వెలిశెట్టి రామారావు, దుర్గాల వెంకటేశ్వర్లు, బీఎంఎస్ నాయకులు వైవీ, ఓరుగంటి సురేష్, నంద్రు నాగబాబు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్‌లో వెల్లివిరిసిన భక్తిభావం

◆అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు అభయమిచ్చిన జగన్మాత 108 రకాల ప్రసాదాలతో మహా నివేదన..

◆ వైభవంగా అన్నదానం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత



**ఖమ్మం, (జనంసాక్షి) :**
శరన్నవరాత్రుల వేళ ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ ఎల్బీనగర్ భక్తిపారవశ్యంతో పునీతమైంది. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజున జగన్మాత సర్వజీవుల ఆకలి తీర్చే సాక్షాత్ 'శ్రీ అన్నపూర్ణాదేవి' దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు. ఈ మహత్తర పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి భక్తిప్రపత్తులతో 108 రకాల విభిన్న పిండివంటలు, నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.
మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆశీస్సులతో, బీఆర్ఎస్ యువజన విభాగం నగర మాజీ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్ బాబు సహాయ సహకారాలతో బీఆర్ఎస్ నాయకుడు వాంకుడోత్ సురేష్ నాయక్ దంపతులు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత ముఖ్య అతిథులుగా విచ్చేసి అమ్మవారి దివ్య సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతికి, సకల జనుల సంక్షేమానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఆయన మార్గదర్శకత్వంలోనే రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించిందని గుర్తుచేస్తూ, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, మళ్లీ కేసీఆర్ ప్రజాహిత పాలన రావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ప్రముఖులు ప్రారంభించిన భారీ అన్నదాన మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పగడాల నాగరాజు, చిరుమామిళ్ల కిరణ్, దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి, వీరేందర్ గౌడ్, మాటేటి కిరణ్ కుమార్, మోరంపూడి సాయి, బొడ్డు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.





## ఘనంగా డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**బూర్గంపహాడ్ అక్టోబర్ 14 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న జన్మదిన వేడుకలను మంగళవారం సాయంత్రం సారపాక ప్రధాన కూడలిలో ఘనంగా నిర్వహించారు. బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి దేవి ప్రసన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వారాల వేణు, బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బెల్లంకొండ వాసుదేవరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పత్తి వెంకటేశ్వర్ రెడ్డి (ప్రగతి బుక్స్), యువజన కాంగ్రెస్ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సారపాక పట్టణ నాయకుడు తిరుపతి చంటి, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టే అనిల్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు దాసరి సాంబయ్య, ఇల్లంగి లాలయ్య, దేవిరెడ్డి వెంకట్రామిరెడ్డి, గుంటక శేషిరెడ్డి, పగడాల మల్లారెడ్డి, ఎస్.కె. మహబూబ్ పాషా, ఎస్.కె. హుస్సేన్, దుగ్గెంపూడి వెంకటరెడ్డి, చెంచలపు శ్రీనివాసరావు, చిలంకూరి భాస్కరరావు, పత్తి మోతీర్, నాగ్ సింధు, ఈశ్వర్, మాతంగి ఏకాంతం, వందవాసు దామోదర్ తదితరులు పాల్గొని దేవి ప్రసన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- **అక్టోబర్ 21 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు**
- **వ్యాసరచన, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలు**
- **అమరవీరుల కుటుంబాలకు పోలీసు అధికారుల పరామర్శ**

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 14 ( జనంసాక్షి)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు దేశ శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధులు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసుల ప్రతిభ, త్యాగాలను ప్రజలకు వివరించనున్నారు. సైబర్ నేరాల నివారణలో పోలీసు పౌరుల యొక్క పాత్ర, డ్రగ్స్ నిర్వహణ: నివారణలో పోలీసుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స నుండి ఎలా దురంగా ఉండగలర
డిగ్రీ మరియు అంతకంటే పై స్థాయి విద్యార్థుల కోసం
1.సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర
2.తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర
కేటగిరీ1: కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు
1.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు
2.పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర మీడియాకు బానిస కాకుండా ఉండటం మరియు వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవడం ఎలా
కేటగిరీ 2: ఎస్ఐ మరియు పై స్థాయి అధికారులకు
పౌరులమన్ననలు పొందటానికి పోలీసులు చేయవలసిన కృషి క్షేత్రస్థాయి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడంఈ పోటీలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. పోలీస్ అమరవీరుల స్మరణార్థం రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. సైకిల్ ర్యాలీల్లో యువత, విద్యార్థులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయనున్నారు. పోలీస్ అధికారులు అమరవీరుల కుటుంబాల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారిని పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అమరవీరుల విగ్రహాలు లేదా ఫొటోలు ఉన్న ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ స్థాయి లేదా అంతకంటే పై స్థాయి అధికారులు గ్రామ పెద్దలు, యువత, విద్యార్థుల సమక్షంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు, పోలీసుల విధులు, ప్రతిభ, ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనాలని కమిషనర్ కోరారు. పాల్గొనేవారు 3 ఫోటోలు మరియు 3 నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్ రూపొందించి సమర్పించాలి. ఫోటోలు 108 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో పూర్తి వివరాలతో అందజేయాలి. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్స్, ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీల కోసం డీజీపీ కార్యాలయం, హైదరాబాద్‌కు పంపించనున్నారు. ఫోటోలు, షార్ట్ ఫిల్మ్‌లను అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ పి ఆర్ వో (8712659256) కార్యాలయంలో అందజేయాలి.
అక్టోబర్ 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా "స్మృతి పరేడ్", "పోలీస్ ఫ్లాగ్ డే" కార్యక్రమాలను పోలీస్ హెడ్ క్వాటర్స్ పరేడ్ గ్రౌండ్స్ లోని స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించనున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఘనంగా ఆడపిల్లల జన్మోత్సవం

### 50 మంది బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 14 (జనంసాక్షి):**
జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి పాలేటి ప్రమీలా ఆధ్వర్యంలో బేటీ బచావో ? బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల జన్మోత్సవం కార్యక్రమాన్ని బుధవారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు కేంద్రంలో నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలకు జన్మనిచ్చిన 50 మంది బాలింతలకు బేటీ జన్మోత్సవం కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో ఆడపిల్లలకు అవసరమైన దుస్తులు, టవల్స్, ఇతర నిత్యావసర వస్తువులతో పాటు పండ్లను కూడా అందించారు. ఆడపిల్లల జననాన్ని గౌరవిస్తూ, వారి పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం, బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఆడపిల్లలు కుటుంబానికి, సమాజానికి గర్వకారణమని, బాలికల జననాన్ని ఆనందంగా స్వాగతించాలని, బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బాలికల పట్ల వివక్షను తొలగించి, వారి ఆరోగ్యం, విద్య, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు , ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ గారు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.డి. సమ్రీన్ , జెండర్ స్పెషలిస్టులు పి. ప్రమీలా, ఆర్. వాసంతి, ఎస్ఎఫ్ఎల్ కె. సతీష్, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ కామినేని బాబు , జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్. ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనాథ శవానికి అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



**ఖమ్మం, (జనంసాక్షి) :**
నగరంలోని ఖమ్మం టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న పాడుబడ్డ గదిలో సుమారు 40 ఏళ్ల వయసు గల మతిస్థిమితం లేని యాచకుడు ఒంటిపై ఎలాంటి గాయాలు లేకుండా మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన టూ టౌన్ పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. నిబంధనల ప్రకారం గడువు ముగిసినా ఎవరూ రాకపోవడంతో దానిని అనాథ శవంగా నిర్ధారించిన పోలీసులు, పోస్టుమార్టం పూర్తి చేయించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో పాటు సామాజిక సేవా సంస్థ అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. టూ టౌన్ ఎస్సై వెంకటేష్, మున్సిపల్ అధికారుల సమక్షంలో అన్నం ఫౌండేషన్ ప్రతినిధులు మార్చురీ నుంచి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని తెల్లటి వస్త్రంతో చుట్టి, పూలమాలలు వేసి గౌరవించి ప్రకాష్‌నగర్ వైకుంఠధామానికి తరలించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ అన్నం శ్రీనివాసరావు, ఎస్సై వెంకటేష్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పాల్గొని హిందూ సాంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు పూర్తి చేశారు.

## ధర్నా చౌక్ ఎత్తివేత ప్రజాస్వామ్యంపై దాడి

- **సీఈసీ జ్ఞానేశ్వర్‌ను తొలగించేవరకు పోరాటం**
- **15 నుంచి 19 వరకు భాజపా దిష్టిబొమ్మల దహనానికి పీడీఎస్‌యూ పిలుపు**



**ఖమ్మం, (జనంసాక్షి) :**
దిల్లీలోని జంతర్ మంతర్ ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం ప్రజాస్వామిక విలువలపై జరిగిన దాడి అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర కార్యదర్శి అనిల్ ధ్వజమెత్తారు. ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పౌరుల ప్రాథమిక హక్కైన ఓటును చోరీ చేసి, దాదాపు 13 కోట్ల మంది ఓటు హక్కును హరించిన కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై జంతర్ మంతర్ వద్ద జెన్–జీ విద్యార్థి, యువజనులు చేపట్టిన ఆందోళనలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం దుర్మార్గమని విమర్శించారు. రైళ్ల రద్దు, మెట్రో స్టేషన్ల మూసివేత, వేలాది మంది పోలీసుల మోహరింపు వంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడానికే ధర్నా చౌక్‌ను తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా అక్టోబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా భాజపా దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామాల నుంచే దిల్లీ తరహా జంతర్ మంతర్ ఉద్యమాలను నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు, మునిగల శివప్రశాంత్, కోశాధికారి కుమార్, నాయకులు తిప్పారపు లక్ష్మణ్, మారుతి, అషూర్, హరీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలతో రైతుల అవస్థలు

## కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి

### జనసేన మండల అధ్యక్షుడు ఇస్లావత్ వినోద్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వం పై మండి పాటు



**అశ్వరావుపేట అక్టోబర్14,(జనంసాక్షి):** తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ అశ్వారావుపేట మండల అధ్యక్షుడు ఇస్లావత్ వినోద్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. ఒకవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, మరోవైపు నీటి సదుపాయం లేకపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని జనసేన పార్టీ అశ్వారావుపేట మండల అధ్యక్షుడు ఇస్లావత్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు సరైన సమయంలో విద్యుత్ సరఫరా కాకపోవడం, పంటలకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. రైతులు ఎన్నో ఆశలతో అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ, ప్రకృతి పరిస్థితులతో పాటు విద్యుత్, నీటి సమస్యలు వారి కష్టాలను మరింత పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయక, పంటలకు అవసరమైన సమయంలో నీరు అందడం లేదని పేర్కొన్నారు. దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడటంతో పాటు, ఇప్పటికే సాగు చేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడి ఇచ్చే పరిస్థితి లేకుండా పోతోందని తెలిపారు.

**రైతుల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం ఎందుకు?**

రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం విద్యుత్ కోతలపై తక్షణమే స్పందించాలని ఇస్లావత్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.సాగునీటి సదుపాయాలు లేని ప్రాంతాల్లో రైతులకు తగిన నీటి వసతి కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతుల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టాలను అంచనా వేసి అర్హులైన రైతులకు తగిన పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి**

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, వ్యవసాయ రంగాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఇస్లావత్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయకూడదని హితవు పలికారు.గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ కోతల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, సాగునీటి సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో విద్యుత్ కోతలను నివారించాలని, రైతులకు సాగునీటి సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ అశ్వారావుపేట మండల అధ్యక్షుడు ఇస్లావత్ వినోద్ కుమార్ కోరారు. రైతుల కష్టాలను గుర్తించి, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# బ్యాంకులు ఏటీఎంల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి

### నైట్ పెట్రోలింగ్‌లో ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ వద్ద నిరంతర తనిఖీలు

### సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్



**సూర్యాపేట (జనంసాక్షి):** బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు సహా ఆర్థిక లావాదేవీలు నిర్వహించే ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ వద్ద భద్రతను మరింత బలోపేతం చేయాలని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు పట్టణంలోని వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించి, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు.ఖాతాదారుల నగదు, ఆస్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బ్యాంకు అధికారులు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నేరగాళ్లు ఏటీఎం కేంద్రాల్లో, బ్యాంకుల్లో చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు.ప్రత్యేక పరికరాలతో కూడిన కిట్లను చిన్న సూట్‌కేసుల్లో తీసుకువచ్చి, సాధారణ వ్యక్తులుగా ఏటీఎం కేంద్రాల్లోకి, బ్యాంక్ లోకి ప్రవేశించి, అతి తక్కువ సమయంలో ఏటీఎంలను ధ్వంసం చేసి నగదును అపహరిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటు న్నాయని పేర్కొన్నారు. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు.అనుమానాస్పద కదలికలు గుర్తించినప్పుడు వెంటనే అప్రమత్తం చేసేలా అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. బ్యాంకుల్లోకి అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశించినప్పుడు, ఆయుధాలతో ఎవరైనా వచ్చినప్పుడు తక్షణమే పోలీసులకు సమాచారం అందేలా సమర్థవంతమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.నైట్ పెట్రోలింగ్‌లో ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ వద్ద నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.నగదు రవాణా సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య, ఎస్ఐలు కనకరత్నం, రహిముద్దీన్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత గ్రామపంచాయతీలే లక్ష్యంగ పనిచేయాలి

## డి ఎం హెచ్ ఓ డాక్టర్ రాహుల్

### ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు జోష్ పై అవగాహన సమావేశం



**కనగల్లు, అక్టోబర్ (జనంసాక్షి)** టిబి రహిత సాధన లక్ష్యంగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ స్థానిక సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం లో ఎంపీడీవో వేద రక్షిత అధ్యక్షతన జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబి ముక్తి భారత్ అభియాన్(జోష్) పైఅవగాహన సమావేశం జరిగింది ఈ సమావేశంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ మండల పరిధిలోని 31 గ్రామాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ క్షయ వ్యాధి నిర్మూలనలో వ్యాధి ముందస్తు గుర్తింపు, ఉచిత పరీక్షలు, చికిత్స, ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలియజేశారు. క్షయవ్యాధి నిర్మూలన ప్రభుత్వ శాఖలకే పరిమితమైన బాధ్యత కాదని, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతోనే టీబీ రహిత సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో టీబీ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి సకాలంలో పరీక్షలు చేయించేందుకు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ, జోష్ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలను క్షయవ్యాధి నిర్మూలన ఉద్యమంలో క్రియాశీల భాగస్వాములుగా చేయడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పరీక్షలకు పంపించడం, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం, బాధితుల పట్ల వివక్షను నివారించడం వంటి కార్యక్రమాలకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని తెలిపారు. అనంతరంటీబీ నిర్మూలన దిశగా కృషి చేసి, టీబీ రహిత గ్రామ పంచాయతీల లక్ష్య సాధనలో భాగస్వాములైన పగిడిమర్రి, బచ్చన్న గూడెం గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులను ఈ సందర్భంగా సన్మానించారు. గ్రామస్థాయిలో ప్రజారోగ్య పరిరక్షణకు వారు చేస్తున్న కృషిని అభినందిస్తూ, భవిష్యత్తులోనూ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిటిసి ఓ రవి ప్రసాద్, ఎస్ టి సి ఎస్ సైదులు, ఎస్ పి ఎల్ ఎస్ అనిల్, ఎం శ్రీనివాస్, ఎండి షాబుద్దీన్ మండల పంచాయతీ అధికారి పి సతీష్ కుమార్, డెమోఅంజయ్య, సర్పంచులు ఓర్సు పెంటయ్య, కా రింగుజానయ్య, చిలక రాజు సునీత వెంకటేశం, అందుగుల సువర్ణ వెంకటేశం, నాగవెల్లి నాగమణి సైదులు, బక్క ఎల్లమ్మ,కొండా రవళి అంజయ్య, కట్టెబోయిన సైదయ్య, పరసనబోయిన వెంకటేశం ఎడ్ల లిఖిత, నామిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అత్యంత భక్తి శ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**హుజూర్‌నగర్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** పట్టణంలో స్వయంభు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నాలుగో రోజు శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం అమ్మవారు శ్రీ కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు పండితులు పోతావజ్జల ఫల్గుణ కుమార్ శర్మ, కల్వకొలను పురుషోత్తమ శర్మచే సంతాన సోమలింగేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చకులు నరగిరి మోహన వంశీ, విష్ణుదత్తు, మోహన్ కృష్ణ, గూడ కార్తికేయ శర్మచే మహిళా భక్తులతో కుంకుమార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు రంగభట్టాచార్యులు మాట్లాడుతూ సింహంపై ఆసీనురాలై కమలం, ఖడ్గం, అభయ వరద ముద్రలతో దర్శనమిచ్చే కాత్యాయని అమ్మవారిని దర్శిస్తే కుజదోషం, బృగుదోషం తొలగి సకాలంలో వివాహం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం నుంచి భక్తులు పోటెత్తగా సేవా సమాజం ఏర్పాట్లు చేసింది. రాత్రి ఆదిశేష వాహన పల్లకీ సేవలో భక్తులే బోయిలుగా పాల్గొని అన్నమయ్య భజనలు, కోలాటాలతో ఊరేగించారు. ఈకార్యక్రమంలో బాచిమంచి కొండయ్య, చంద్రం, గజ్జి ప్రభాకర్, కేవీఎన్ మూర్తి, కోల నాగేశ్వరరావు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, నరసింహారావు, జూలకంటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు చేసుకోవాలి

✧ ఓటు నమోదు చేసుకుందాం, ప్రజాస్వామ్యాన్ని పటిష్ట పరుద్దాం

✧ ఉపాధ్యాయుడు వక్కంతుల భరత్ బాబు



**మునగాల, అక్టోబర్ 14(జనంసాక్షి):** వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదు పత్రాలను మునగాల తహసీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయుడు వక్కంతుల భరత్ బాబు బుధవారం సమర్పించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు నియమావళి 1960 రూల్ 31 ప్రకారం శాసనమండలి ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఎన్నికల సంఘం కొత్త ఓటర్ జాబితాను తయారు చేయవలసిన సందర్భంలో గతంలో ఓటు ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ మళ్లీ ఫారం 18 నింపి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, కావున ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్స్ నవంబర్ 6లోపు ఒక దరఖాస్తులు సమర్పించి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, తద్వారా ఎక్కువ మంది ఓటింగ్లో పాల్గొనడం ద్వారా సరైన వ్యక్తులను ఎన్నుకునే అవకాశం తద్వారా ప్రజాస్వామ్య సుపరిపాలన నిరుద్యోగుల, ఉద్యోగుల స్థితిగతులను, ఎల్లవేళలా నిరుద్యోగుల సమస్యలను ప్రశ్నించే ఎమ్మెల్సీలను చట్టసభకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులను, ఎన్నుకునే, చూసే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మాయమైన చెరువు ఎక్కడుంది బాబోయ్ జర చెప్పండి

○అధికారుల వద్ద చెరువు రికార్డులు..

○అయినా కొత్త కమిషన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం!

○అసలు చెరువే లేదంటూ హైకోర్టులో పిటిషన్!



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్14 (జనం సాక్షి):** పాల్వంచ పట్టణ నడిబొడ్డున శ్రీనగర్ కాలనీను ఆనుకుని ఉన్న మేడికుంట చెరువు వ్యవహారం హైకోర్టుకు చేరింది. అసలు చెరువే లేదంటూ కొందరు పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. మరోవైపు, చెరువుకు సంబంధించిన అధికారిక పత్రాలను ఇరిగేషన్ అధికారులు హైకోర్టుకు సమర్పించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కొత్త కమిషన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం రావడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అసలు చెరువు ఉనికినే ప్రశ్నిస్తూ పిటిషన్ దాఖలైతే.. అధికారిక రికార్డులు ఏం చెబుతున్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండెకరాలకు పైగా విస్తీర్ణం ఉన్నట్లు స్థానికులు చెబుతున్న మేడికుంట చెరువు, నక్కలవాగుతో ఉన్న సంబంధంపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. పాల్వంచ అభివృద్ధి కోసం మాట్లాడే నాయకులు ఈ చెరువు వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. చెరువు ఉనికిపై సందేహాలా.. అధికారిక రికార్డుల ఆధారంగా నిజానిజాలు తేల్చాలి! ఆక్రమణ ఆరోపణల్లో వాస్తవాలను విచారణ ద్వారా నిర్ధారించి, మేడికుంట చెరువు భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కామేపల్లిలో అలరించిన 'కార్మిక మహిళా సోదరుల బతుకమ్మ



**కామేపల్లి అక్టోబర్ 14 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో 'కార్మిక బతుకమ్మ' వేడుకలను , బుధవారం అత్యంత కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు పి. రమ్య, మండల కన్వీనర్ బాదావత్ శ్రీను మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వారి పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నాయని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లకు గౌరవ వేతనం పేరిట వెట్టిచాకిరీ చేయించుకోవడం దారుణమని, తక్షణమే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులతో పాటు నాణ్యమైన యూనిఫారాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో సోమలాల్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు కోర్ర నీలా, చీమల పుష్ప, బానోతు అరుణ, ప్రమీల, అహల్య, ముక్తి రామారావు, కొత్తపల్లి ఉపేందర్, రాయల వీరభద్రం, మంగిలాల్, సుమతి, నిర్మల, స్వరూప, కళ్యాణి, జ్యోతి, రావూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దవూరలో ఘనంగా బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ప్రారంభం



**పెద్దవూర, అక్టోబర్ 14 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజల సమక్షంలో బంక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ టెరిటరీ మేనేజర్ సుధీర్ కన్నాల, సీఓ మనీష్ విట్టల్, కంపెనీ ఇంజనీర్లు ఆదిత్య యాదవ్, చంద్రకాంత్, డీలర్ అర్ని పద్మారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.నల్గొండ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కూతాటి సంధ్య మురళి, పెద్దవూర మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.అలాగే వివిధ గ్రామాల సర్పంచులు అయితేగోని వెంకటయ్య గౌడ్, బాసు నాయక్, నాగేశ్వరరావు నాయక్‌తో పాటు స్థానిక నాయకులు, గ్రామస్తులు, బంక్ యజమానులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ పెద్దవూర పరిసర ప్రాంతాల వాహనదారులు, రైతులకు ఈ పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడం వల్ల నాణ్యమైన ఇంధనం సులభంగా లభిస్తుందని తెలిపారు. ఇంధనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో ప్రయాణ సమయం ఆదా అవుతుందని హర్షం వ్యక్తం చేశారు.

# జూనియర్ డాక్టర్ల నిరసన స్టైఫండ్ రావట్లేదని ఆవేదన




**కొత్తగూడెం పట్టణం అక్టోబర్ 14 జనంసాక్షి** కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో గత సంవత్సరం నుంచి స్టైపు అండ్ రావట్లేదని ఆవేదన చెందుతూ నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు గుర్రాలకు వెళితే గత సంవత్సరం నుంచి మాకు స్టైఫ్ అండ్ రావట్లేదు మేము దినదినం ఆర్థిక ఇబ్బందులు కొట్టుమిట్టాడుతున్నాము ఇంటి రెంటలు కూడా కట్టలేకుండా ఉన్నాము నెలవారి ఆర్థిక అవసరాలు పూర్తిగా తీరట్లేదని దయచేసి ప్రభుత్వం వెంటనే అందించాలని బాధ తప్త హృదయాలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో పలువురు జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ కొరడా!

## టిప్పర్, ఇసుక లోడింగ్‌లో ఉన్న జేసీబీ స్వాధీనం





**బూర్గంపహాడ్ అక్టోబర్ 14 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలో అక్రమ ఇసుక రవాణాపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌తో పాటు ఇసుక లోడింగ్‌కు ఉపయోగిస్తున్న జేసీబీని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లోని కొల్లు సమీపంలో అక్రమంగా ఇసుక లోడింగ్, రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్ నేతృత్వంలో ఎస్ఐలు సుమన్, రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా ఇసుక లోడింగ్ చేస్తున్న జేసీబీతో పాటు రవాణాకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై నిఘా పెంచిన టాస్క్‌ఫోర్స్ అధికారులు, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవనే సంకేతాలు ఇచ్చారు.

### అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో

# నడిరోడ్లపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

○ప్రమాదాల గుప్పిట్లో ప్రజలు రైతులు వాహనదారులు గోవిందాల

- రాయి గూడెం మధ్యలో ప్రధాన రహదారి పై

○విద్యుత్ శాఖ ఏఈ పరిరక్షణ కరువు ఇటువైపు కన్నెత్తి చూడని లోపం

○ పేరుకే కాంట్రాక్టర్ ప్రభుత్వ ఖజానా కాళీ బిల్లులకు పరిమితం అవుతున్న విద్యుత్ శాఖ

○క్వాలిటీ కంట్రోల్ అధికారుల ప్రమేయం లేకుండానే బిల్లులు విడుదల



పరిశీలన జరిపి, రహదారిపై ఆటంకంగా ఉన్న స్తంభాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రజలు, వాహనదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**కామేపల్లి అక్టోబర్ 14 ( జనంసాక్షి ):** విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్య వైఖరి స్థానిక ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. అధికారులు అండగా నిలవడంతో కాంట్రాక్టర్లు కనీస నియమావళి పాటించకుండా ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు, సపోర్టింగ్ (స్టే) వైర్లను నడిరోడ్డుకే ఏర్పాటు చేస్తున్నారు. కామేపల్లి మండలంలోని రాయిగూడెం ? గోవిందాల గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రహదారిపై విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.?రహదారిని ఆనుకుని, వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగించేలా సపోర్టింగ్ పోల్లను పాతేశారు. రోజువారీగా ఈ మార్గం గుండా పాఠశాల బస్సులు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు నిత్యం ప్రయాణిస్తుంటాయి. రాత్రివేళల్లో ఈ సపోర్టింగ్ వైర్లు, స్తంభాలు సరిగ్గా కనిపించక వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్లు తమకు తోచినట్లు పనులు పూర్తి చేసి వెళ్లడంతో, ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?ఏదైనా పెద్ద ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా, విద్యుత్ మరియు ఆర్ అండ్ బి శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి

# ఆస్తుల గురించి మాట్లాడే ముందు.. మీ ఆస్తుల లెక్కలు తేల్చండి!

## రేగా కాంతారావుకు కాంగ్రెస్ నేతల సవాల్.. బహిరంగ చర్చకు సిద్ధమా?



**అశ్వాపురం అక్టోబర్ 14 (జనంసాక్షి):** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సామాజిక మాధ్యమాల్లో చేసిన ఆరోపణలను అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇతరుల ఆస్తుల గురించి విమర్శలు చేసే ముందు రేగా కాంతారావు తన ఆస్తుల వివరాలు, రథంగుట్ట భూముల వ్యవహారంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు డిమాండ్ చేశారు.అశ్వాపురంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2009 ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తులు ఎన్ని? ప్రస్తుతం తన పేరు మీద, కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తులు ఎన్ని? అప్పటికి, ఇప్పటికి ఆస్తుల్లో వచ్చిన మార్పులేమిటి? అనే వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.రథంగుట్ట భూముల వ్యవహారంతో పాటు గతంలో జరిగిన భూ లావాదేవీలు, అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎవరి హయాంలో ఎంత భూమి కబ్జాకు గురైంది? ఏయే భూ లావాదేవీలు జరిగాయి? అనే అంశాలపై ఆధారాలతో సహా బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.తమ పార్టీ కార్యాలయాన్ని సైతం ఆక్రమించారంటూ రేగా కాంతారావుపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, అటువంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పాయం వెంకటేశ్వర్లుపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తమపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్ కుమార్, వేములపల్లి రమేష్, మచ్చా నరసింహారావు, కుంజా జాను, ఆవుల రవి, బూరెడ్డి వెంకటరెడ్డి, తూము వీరరాఘవులు, కాకా రాములు, బచ్చు వెంకటరమణ, సామకూర వెంకన్న, మట్టా వీరభద్రారెడ్డి, వెంకటాచారి, మోసీన్, గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, కంటెం నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# నేడే స్వాతి గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం

**ప్రజలకు తక్కువ ధరలకు అందుబాటులో ఫ్యామిలీ రెస్టారెంట్**

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 14 (జనం సాక్షి):** పాల్వంచ పట్టణంలోనూతనంగా ప్రజలకు అనుగుణంగా స్వాతి గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ గురువారం మంత్రి తుమ్మల, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు చేతుల మీదుగా ప్రారంభం కానంది. ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమాని మాట్లాడుతూ విశాలమైన డిజైనింగ్ సదుపాయం మరియు అధునాతన వస్తువులతో ఈ రెస్టారెంట్ ఆహార ప్రియులకు మధ్యతరగతి వారికి రేట్లు అందుబాటులో ఉన్నాయని సౌత్ ఇండియన్, నార్త్ ఇండియన్ కమ్మనైన భోజన వంటకాలు బిర్యాని ,మండి, నోరూరించే రుచులతో ప్రజలకు తక్కువ ధరలకు, అందించాలనే సంకల్పంతో నాణ్యతతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా రెస్టారెంట్ ప్రారంభం జరుగుతుందని. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, కార్పొరేటర్ బత్తుల మధు చంద్, అన్నపూర్ణ , సరిత, గుణ చరిత్, సాయిబాబా, సింధు తపస్వి, నరేష్ తదితరులు పాల్గొంటారని ఈ సందర్భంగా తెలిపారు.




## బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో

# భాగంగా బాలికల దినోత్సవ వేడుకలు

**ఖమ్మం , అక్టోబర్ 14 (జనం సాక్షి)**

బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలోని బాలల సదనంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి పాలేటి ప్రమీలా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికలతో కేక్ కట్ చేయించి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ శ్రీజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవి మానస ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రత, సమాన అవకాశాలపై అవగాహన కల్పించారు. బాలికల పట్ల వివక్షను తొలగించి, వారికి సమాన హక్కులు కల్పించాలని, బాల్యవివాహాలను అరికట్టి వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీచైర్‌పర్సన్ భారతి , సి డబ్ల్యూ సి సభ్యులు, బాలల సంరక్షణ అధికారి విష్ణు వందన , ఈఓ కల్యాణి గారు, బాలల సదనం సూపరింటెండెంట్ నవ్య, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.డి. సమ్రీన్, జెండర్ స్పెషలిస్టులు పి. ప్రమీలా, ఆర్. వాసంతి, కె. సతీష్, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ కొమినేని బాబు , జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్. ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలిగించాలి

## కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు డిమాండ్!



**కామేపల్లి అక్టోబర్ 14 (జనంసాక్షి):** ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పేరిట సుమారు 13 కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లను గల్లంతు చేస్తూ, ఫారం-6 లో దుస్సాధ్యమైన నిబంధనలతో యువతకు ఓటు హక్కు లేకుండా చేస్తున్న భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు డిమాండ్ చేశారు. ఆర్టికల్ 324 ఇచ్చే రాజ్యాంగబద్ధమైన స్థానాన్ని దెబ్బతీస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సీఈసీపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలన్నారు.? బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పది నెలల కాలంలో సహ అధికారులు 14 సార్లు అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోకుండా అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇటీవల ఈసీఐ విడుదల చేసిన ప్రెస్ నోట్ లో ఫారం-6 సడలింపులను అంగీకరించడమే వారి తప్పునకు నిదర్శనమన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేసి, తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చడంతో పాటు ఈ అక్రమాలపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# వైద్య ఖర్చులకు అండగా వసుధ ఫౌండేషన్

## బాధితుడుకి రూ.10 వేల ఆర్థిక సాయం



**భద్రాచలం అక్టోబర్ 14 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న భద్రాచలానికి చెందిన వెంకటరమణకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక భరోసా కల్పించింది. చికిత్సకు అవసరమైన ఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులు ఫౌండేషన్‌ను సంప్రదించగా, స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కు సూచించారు. ఈ మేరకు భద్రాచలం సీఐ సట్ల రాజు చేతుల మీదుగా వెంకటరమణ భర్త సోమయ్యకు రూ.10 వేల చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన వసుధ ఫౌండేషన్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## డీఎంహెచ్ఓ డా.రాహుల్

**చండూరు, అక్టోబర్ 14 (జనంసాక్షి)** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని నల్లగొండ జిల్లా వైద్య ఙ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాహుల్ సిబ్బందికి సూచించారు. బుధవారం చండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అర్హులైన బాలికలు గర్భాశయ హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మందుల నిల్వలను, గడువు తేదీలను ,పలు రికార్డులను పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట హెచ్ఈఈఓ అంజయ్య, రంజిత్, వైద్యాధికారి డాక్టర్ సంధ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశం, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉన్నారు.



# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు

**మహా చండీ దేవి గా దర్శనమిచ్చిన అమ్మవారు**

**ఎన్టీఆర్ ఎక్స్ రోడ్డులో ఘనంగా 4వ రోజు పూజా కార్యక్రమాలు**

**పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు - అరుణ దంపతులు**



**చండూరు, అక్టోబర్ 14 (జనంసాక్షి)** చండూరు మున్సిపల్ కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక శోభతో వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్ ఎక్స్ రోడ్డు వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మవారు భక్తులకు 'మహా చండీ దేవి' రూపంలో దర్శనమిచ్చారు. సకల శుభాలను, శక్తిని ప్రసాదించే జగన్మాతను దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకల్లో చండూరు మున్సిపాలిటీ చైర్మన్ కోడి శ్రీనివాసులు ? అరుణ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకల జీవులకు రక్షణనిచ్చే జగజ్జనని అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, దుర్గామాత ఆశీస్సు లతో పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లా లని ప్రార్థించినట్లు తెలిపారు. లోక రక్షణ కోసం మహిషాసురుడిని వధించేందుకు ఆదిపరాశక్తి దాల్చిన రూపాలను స్మరిస్తూ జరుపుకునే ఈ నవరాత్రులు ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు చైర్మన్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కాలనీవాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి గిరిజనుడికి సంక్షేమ పథకాలు అందించాలి

- పథకాల అమలులో సమస్యలను గుర్తించి పరిష్కరించాలి..
- తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్..

**భద్రాచలం అక్టోబర్ 14 (జనంసాక్షి)**

ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన తెగల కుటుంబాలతో పాటు అర్హులైన ప్రతి గిరిజనుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి వీడియో సమావేశం ద్వారా ఐటీడీఏల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతితో పాటు పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా చేరవేయాలని, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయోజనాలు అందించాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.



గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, గృహ నిర్మాణం, జీవనోపాధి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పథకాల అమలులో ఎదురవుతున్న అడ్డంకులను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేకించి అత్యంత వెనుకబడిన గిరిజన తెగల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయా లేదా అనే అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలు అర్హులైన వారందరికీ చేరినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. డైరెక్టర్ సూచనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన గిరిజన కుటుంబాలకు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తెలిపారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, గిరిజన సంక్షేమ ఉప సంచాలకురాలు చందన, పీవీటీజీ అధికారి గన్యా, గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మధుకర్, జీసీసీ డీఎం రామానందం, డివిజన్ మేనేజర్ సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యశోదమ్మ మృతి పార్టీకి తీరని లోటు

**మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి**

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 14:(జనం సాక్షి )**



కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నాయకురాలు సంగిశెట్టి యశోదమ్మ అందించిన సేవలు మరువలేనివని, ఆమె మృతి పార్టీకి తీరని లోటని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు యశోదమ్మ మృతి చెందడంతో బుధవారం ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి యశోదమ్మ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో మనోధైర్యంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్‌నాయక్, కౌన్సిలర్లు బోయిన కుమారి, సంగయ్య, బానోత్ దివ్య, పుల్చంద్, కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తినాయక్, వెంకట నారాయణ, సాయి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవిగా అమ్మవారి దర్శనం

## 108 రకాల నైవేద్యాల సమర్పణ

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 14 (జనంసాక్షి)**



నగరంలోని 8వ డివిజన్ ఎల్బీనగర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు అమ్మవారు భక్తులకు శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి భక్తిప్రపత్తులతో 108 రకాల పిండివంటలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆశీస్సులతో, బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్ బాబు సహకారంతో బిఆర్ఎస్ నాయకుడు వాంకుడోత్ సురేష్ నాయక్ దంపతులు ఈ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంక్షేమానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని పేర్కొంటూ, మళ్లీ కేసీఆర్ ప్రజాపాలన రావాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం వారు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పగడాల నాగరాజు, చిరుమామిళ్ల కిరణ్, దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి, వీరేందర్ గౌడ్, మాటేటి కిరణ్ కుమార్, మోరంపూడి సాయి, బొడ్డు వెంకటేశ్వర్లు, రెంటపల్లి రమేష్, వడనపు శ్రీనివాసరావు, రామకృష్ణ, అకేటి అర్జున్, గొల్లపూడి ఉపేందర్, తెలపురెడ్డి గోపిరెడ్డి, షైక్ రహీమ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**చంద్రుగొండ, అక్టోబర్ 14 (జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. పండుగ విశిష్టతను చాటుతూ సిబ్బంది ఐకమత్యంతో సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాము, సామాజిక ఆరోగ్య అధికారి హరికృష్ణతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు చంద్రుగొండకు మంత్రి పొంగులేటి, ఎంపీ రామసహాయం రాక

**చిట్టెమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొననున్న ప్రముఖులు**

**చంద్రుగొండ, అక్టోబర్ 14 (జనంసాక్షి):**

చంద్రుగొండ మండలంలో నిర్వహించనున్న ఓ ప్రైవేటు కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు నేడు హాజరుకానున్నారు. మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి మాతృమూర్తి అంకిరెడ్డి చిట్టెమ్మ దశదిన కార్యక్రమంలో వారు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకానున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ తెలిపారు.

## జ్ఞానేశ్వర్ ను సీఈసీ నుండి తొలగించాలని అక్టోబర్ 15 నుండి 19 వరకు బిజెపి ప్రభుత్వ దిష్టిబొమ్మల దగ్ధం చేయండి! కాంపాటి పృథ్వీ

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 14 ( జనం సాక్షి )**

ఓటు చోర్ జ్ఞానేశ్వర్ ను సీఈసీ నుండి తొలగించేంతవరకు ప్రగతి శీల శక్తులు, ప్రజాస్వామ్యవాదులు ఉద్యమాలను కొనసాగించాలని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర కార్యదర్శి అనిల్ అన్నారు. ఈరోజు ఖమ్మం పట్టణం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పిడిఎస్యు రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ప్రజల, పౌరుల ప్రాథమిక హక్కు అయిన ఓటింగ్ హక్కును చోరీ చేసి, 13 కోట్ల మంది ఓటు హక్కును హరించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలని జంతర్ మంతర్ లో జెన్ జీ విద్యార్థి, యువత ఇచ్చిన ఉద్యమ పిలుపు

మోడీ ప్రభుత్వం అడ్డుకొని దుర్మార్గంగా వ్యవహరించిందని అన్నారు. మోడీ ప్రభుత్వం వందలాది రైళ్లు రద్దు చేసి, మెట్రో స్టేషన్ లను మూసి వేయడం, వేలాది మంది పోలీసులను మోహరించడం నిరంకుశ పాశవిక చర్య అని అన్నారు. మోడీ ప్రభుత్వం ఎంత నియంత్రించాలని అనుకున్నా ఉవ్వెత్తున ఎగిసిపడిన యువతరానికి తలొగ్గక తప్పలేదని దానికి నిదర్శనమే జంతర్ మంతర్ ధర్నా చౌక్ ఎత్తివేయడం అని అన్నారు. ప్రజాస్వామికంగా ప్రజలు, యువత నిరసన తెలిపే హక్కును కాల రాయడం కాదా అని ప్రశ్నించారు. ఇది మోడీ, షా ప్రభుత్వ నేరాలను, ఘోరాలను, అక్రమంగా ఎన్నికయ్యే తీరును కప్పి పెట్టుకోడానికి చేస్తున్న నిర్బంధం. సిజెపి నేత అభిజిత్ దీప్కేతో పాటు వేల మందిని అరెస్ట్ చేయడం బిజెపి నైతిక ఓటమికి గురైందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాన్ని చూసి భయపడుతుందని ఇది పిరికి చర్య అని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వ ఈ చర్యల వలన ఆ ఉద్యమం ఒక మెట్టు విజయం సాధించింది అని భావిస్తున్నాము అని తెలిపారు. నిర్బంధం ద్వారా ఓట్ చోరీ ఉద్యమాన్ని ఆపలేరని తెలియజేశారు.

## కూరాకుల నాగభూషణాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధు

**ఖమ్మం, (జనంసాక్షి) :**



ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణాన్ని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న నాగభూషణాన్ని బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన కలిశారు. ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాగభూషణం త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా జీవితంలోకి రావాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, రూరల్ మండల మాజీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## గజలక్ష్మి అలంకారంలో లక్ష్మీతాయారు అమ్మవారి దర్శనం

**- శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. భక్తుల సందడి**

**భద్రాచలం అక్టోబర్ 14 (జనంసాక్షి)**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించి, అనంతరం గజలక్ష్మి అలంకరణతో ముస్తాబు చేసి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మరోవైపు మారుతి సదనంలో శ్రీరామాయణ పారాయణం కొనసాగుతోంది. గురువారం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

